త్వరలో మున్సిపాలిటీగా

పీలేరు..?

● ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసిన ఎమ్మెల్యే నల్లారి
● మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలోనూ పరిశీలన


పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం


పీలేరు వ్యూ

పీలేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న పీలేరు త్వరలో మున్సిపాలిటీగా అవతరించనున్నట్లు తెలుస్తోంది. దినా దినాభివృద్ధి చెందుతున్న పీలేరును అభివృద్ధి పథంలో నిలపాలంటే మున్సిపాలిటీగా చేయక తప్పదనే అభిప్రాయంతో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. భౌగోళికంగా, జనాభా పరంగా, ఆర్థికపరంగా ఏనాడో మున్సిపాలిటీ స్థాయికి చేరుకున్న పీలేరు గ్రామ పంచాయతీ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీ కాలేకపోయిందని, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా దానిని మున్సిపాలిటీగా మార్చక తప్పడం లేదని వారు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో ఏకైక మేజర్ పంచాయతీ

ప్రస్తుత అన్నమయ్య జిల్లాలో పీలేరు గ్రామ పంచాయతీ ఏకైక మేజర్ పంచాయతీగా ఉంది. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దినాదినాభివృద్ధి చెందిన పంచాయతీల్లో ఒకటిగా ఉండేది. చిత్తూరు, మదనపల్లె, తిరుపతి, రాయచోటి పట్టణాలకు సమాన దూరంలో (58 కిలోమీటర్లు) ఉన్న పీలేరులో స్థానికులే కాకుండా పొరుగున ఉన్న సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విద్య, వ్యాపార కూడలిగా మారడంతో ప్రతి రోజూ వివిధ అవసరాల కోసం పీలేరుకు సుమారు 3 వేల మంది వచ్చి వెళుతుంటారని అంచనా. పీలేరు గ్రామ పంచాయతీ రికార్డుల మేరకు ప్రస్తుతం పంచాయతీలో ఇంటి పన్నులు చెల్లిస్తున్న ఇళ్ల సంఖ్య 11,130 కాగా పన్నులు చెల్లించకుండా మరో 6 వేల ఇళ్ల వరకు ఉన్నాయని అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం పీలేరు పట్టణంలో 41,256 మంది జనాభా ఉండగా ప్రస్తుతం అది 60 వేలు దాటి ఉంటుందని అంచనా. అంతేకాకుండా భౌగోళికంగానూ పీలేరు పట్టణం సుమారు 4 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. దీంతో పరిపాలనా సౌలభ్యంతో పాటు అభివృద్ధి పనుల నిధుల కోసం పంచాయతీని మున్సిపాలిటీ చేయక తప్పని పరిస్థితి నెలకొందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నాలుగు పంచాయతీలతో...

పీలేరు పట్టణంతో కూడిన పీలేరు గ్రామ పంచాయతీతో పాటు పొరుగున ఉన్న బోడుమల్లువారిపల్లె, దొడ్డిపల్లె, ఎర్రగుంట్లపల్లె గ్రామ పంచాయతీలతో కలిపి పీలేరు మున్సిపాలిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. పీలేరు-కడప మార్గంలోని బోడుమల్లువారిపల్లె బ్రిడ్జి, పీలేరు-మదనపల్లె మార్గంలో ఉన్న బడబళ్లవంక బ్రిడ్జి, పీలేరు-తిరుపతి మార్గంలో హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న బ్రిడ్జి, పీలేరు-సదుం మార్గంలో దొడ్డిపల్లె పంచాయతీలోని కొత్తపేట గ్రామాన్ని కలుపుకుని పీలేరు మున్సిపాలిటీ ఏర్పాటు చేయవచ్చునని ప్రాథమిక ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు పట్టణ విస్తీర్ణం, జనాభా, ఆదాయం వంటి సాంకేతిక అంశాలు కలిసి వస్తాయని అధికార పార్టీ వర్గాలు ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ప్రతిపాదనలు అందజేశారు. ఆయన ప్రతిపాదనలపై వారిద్దరూ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పీలేరు వ్యవహారాలపై బాగా పట్టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే ప్రతిపాదనపై హర్షం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అభివృద్ధి కోసమే మున్సిపాలిటీ ప్రతిపాదన

రోజురోజుకు పెరుగుతున్న పీలేరును అభివృద్ధి చేయడానికే మున్సిపాలిటీ ప్రతిపాదనలు చేశాం. మా అన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పీలేరును మున్సిపాలిటీ చేయాలని ప్రయత్నించినప్పటికీ సాంకేతిక కారణాలతో చేయలేకపోయాం. ఇప్పుడు అన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పీలేరును మున్సిపాలిటీ చేసేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ కూడా పరిశీలన చేస్తుండడం పీలేరుకు కలిసి వచ్చే అంశం. మున్సిపాలిటీలకు పెద్దఎత్తున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వస్తాయి. తద్వారా అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. త్వరలో పీలేరులో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను కూడా చైతన్యవంతులను చేస్తాం.

- నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే

ఏడాదికి రూ.5 కోట్ల ఆదాయం

మేజర్ పంచాయతీ కావడంతో ప్రస్తుతం పీలేరుకు ఏడాదికి రూ.5 కోట్ల మేర ఆదాయం ఉంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు, వేలం పాటలు, వివిధ పన్నుల వసూళ్ల రూపంలో ఆ ఆదాయం సమకూరుతోంది. అయితే నానాటికీ పెరిగిపోతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు చాలడం లేదన్న అభిప్రాయం అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల్లోనూ ఉంది. రోజురోజుకు పట్టణంలో స్థిరపడుతున్న వారి సంఖ్య, ఏర్పాటవుతున్న కాలనీలు పెరుగుతుండడంతో వాటిలో మౌలిక వసతులు కల్పించడం అధికారులు, ప్రజాప్రతినిధులకు కత్తి మీద సాములా మారింది. పట్టణం పెరుగుతున్న కొద్దీ పక్కనున్న పంచాయతీల పరిధిలోకి విస్తరిస్తుండడం, ఆ పంచాయతీలకు ఆదాయం వెళుతుండడంతో పీలేరుకు ఆదాయం తగ్గుతోంది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీ ఆలోచన చేసినట్లు తెలుస్తోంది.

కమనీయం...నరసింహస్వామి కల్యాణం

● ముగిసిన స్వామి వారి పవిత్రోత్సవాలు


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు గురువారం కన్నులపండువలా చేశారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. స్వామి వారి ఆయుధమైన శ్రీచక్రానికి వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు విసర్జనతో ముగిశాయి. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కన్నులపండువలా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం స్వామి వారు గ్రామపురవీధుల్లో తిరుచ్చి వాహనంపై విహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, గోకుల్, ధనుష్, వెంకీ, బాలాజి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛతను భాగం చేసుకోవాలి'


చీపురుపట్టి చెత్త ఊడుస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ దైనందిన జీవితంలో స్వచ్ఛతను భాగం చేసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటి పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయం నుంచి మార్కెట్‌యార్డు వరకు రోడ్లను, కాలువలను శుభ్రపరిచే కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో పాటు కలెక్టర్ పాల్గొన్నారు. ఏక్ దిన్ ఏక్ ఘంట ఏక్ సాథ్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిశుభ్రత డ్రైవ్ కార్యక్రమంలో ప్రజలందరూ శ్రమదానం చేసి భాగస్వాములు కావాలని ప్రభుత్వ పిలుపు మేరకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వివిధ రకాలైన పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వేర్వేరు జిల్లాల్లో పాల్గొని ప్రజలకు ప్రేరణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఘన, వ్యర్థ పదార్థాలను ప్రతి కుటుంబం జాగ్రత్తగా తొలగించాలని, డోర్ టు డోర్ చెత్త సేకరణ విషయంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఎల్‌డీఎం ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2621 మెట్రిక్ టన్నుల యూరియా

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2621 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సరిపడే యూరియా అందుబాటులో ఉందని రైతులు అపోహలకు గురికావద్దని తెలియజేశారు. జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 83 దుకాణాల్లో 967 మెట్రిక్ టన్నులు, 211 రైతు సేవా కేంద్రాల్లో 1654 మెట్రిక్ టన్నులు యూరియా ఉందన్నారు. అవసరమున్న చోట 24 గంటల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. యూరియా ఎక్కువ మొత్తంలో రైతులు కొనుగోలు చేయరాదని తెలియజేశారు. సమయానుకూలంగా కావాల్సిన నిల్వలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పంటలకు అవసరమైన మోతాదు కన్నా ఎక్కువ యూరియా వాడటం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశించి పిచికారీ ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడి, నాణ్యత కూడా తగ్గుతుందన్నారు. రైతులు జీవన ఎరువులు అయిన అజిటో బ్యాక్టీరియా, అజొల్లా, రైబోజియం, మొదలగునవి వాడాలని తెలిపారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి
● సానుకూలంగా స్పందించిన హోం మంత్రి అనిత


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ వందలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను సమీక్షించి ఎత్తివేయాలని, దీని కార్యాచరణ కోసం హోం మంత్రి చొరవ తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం శాసనసభలో శాంతిభద్రతల అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీఎం చంద్రబాబుతో పాటు మా అందరి మీద అంగళ్లలో దాడులు చేసి తిరిగి తమ పైనే ఆయుధాలు, హత్యాయత్నం నేరాల కింద కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. దీంతో ఎలాంటి సంబంధం లేని నాయకులతో పాటు వందలాది మంది టీడీపీ కార్యకర్తలను కూడా కేసుల్లో ఇరికించారని చెప్పారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల ప్రోద్బలంతోనే పోలీసులు తమపై వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. తాము హైకోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకుంటే ప్రభుత్వం దాదాపు రూ.60 లక్షలు ఖర్చు పెట్టి సుప్రీంకోర్టులో బెయిల్ రద్దుకు ప్రయత్నించిందని వివరించారు. దేవుడి దయ వల్ల తాము సుప్రీంకోర్టు తీర్పుతో బయటపడ్డామని లేదంటే కనీసం మూడు నెలలు జైల్లో ఉండాల్సి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోం మంత్రి అనిత జోక్యం చేసుకుంటూ కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పిన విధంగా ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇప్పటికే ఈ కేసుల గురించి అధ్యయనం చేశామని చాలా కేసుల్లో ఆధారాలే లేవని గుర్తించామన్నారు. అయితే చట్టబద్ధంగా ముందుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కిశోర్‌కుమార్ రెడ్డి పేరు ప్రస్తావిస్తూ అంగళ్ల దాడుల ఘటనను వివరిస్తూ సీఎం చంద్రబాబు కూడా ప్రసంగించారు.

చోరీ కేసులో ఇరువురు నిందితుల అరెస్ట్

● రూ.4.70 లక్షల విలువైన బంగారు, నగదు రికవరీ
● వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


మీడియా సమావేశంలో చోరీ కేసు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం, రాయచోటి, కడప తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇరువురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4.70 లక్షల విలువైన బంగారు, నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. చిన్నమండెం మండలం పడమటికోన గ్రామం కుమ్మరపల్లికి చెందిన రేపన బాలాజీ, అయ్యగారిపల్లెకు చెందిన మండెం సాయికుమార్‌లు ఈనెల 16వ తేదీ రాత్రి చిన్నమండెం మండలంలోని రామనాధపురంలో చోరీకి పాల్పడి 18 గ్రాముల బంగారు చైనుతో పాటు నగదు రూ.12 వేలు చోరీ చేశారు. అలాగే ఆగస్టు 7వ తేదీ రాత్రి రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరంలో రూ.1.80 లక్షలు నగదు, ఫోన్ చోరీ చేశారు. అలాగే ఈనెల 18వ తేదీ రాత్రి కడప బస్టాండు సమీపంలో ఏపీ39 ఏఎల్ 9512 అనే యాక్సెస్ 125 స్కూటీని చోరీ చేశారు. ఈ చోరీ సంఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉదయం చిన్నమండెం మండలం పడమటికోన పంచాయతీ నడిగడ్డపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిందితులను అరెస్టు చేసి బంగారు, నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


జగన్మాత.. నమోస్తుతే...

● వైభవంగా దసరా ఉత్సవాలు ● వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం


రైల్వేకోడూరు కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వనవిహారిణి అలంకారం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవీ శరన్నవరాత్రులు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తుతున్నారు. గురువారం నాల్గవ రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మదనపల్లెలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా, కోర్టులో గంగమ్మ ఆలయంలో గంధం అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. రాజంపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా, రైల్వేకోడూరులోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వనవిహారిణి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే పీలేరులోని రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో కాత్యాయనిగా, గుర్రంకొండ రెడ్డెమ్మ ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


కాత్యాయని దేవి అలంకరణలో పీలేరు రౌద్రాల అంకాళమ్మ


మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు


రాజంపేటలోని చౌడేశ్వరి ఆలయంలో ధనలక్ష్మీదేవి అలంకారం


గుర్రంకొండ రెడ్డెమ్మ ఆలయంలో పార్వతిదేవి అలంకారం


వీరభద్రాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భద్రకాళీ అమ్మవారు


మదనపల్లె కోర్టులో గంగమ్మ ఆలయంలో గంధం అలంకరణలో గంగమ్మ

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురువారం నుంచి నీరు నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు నుంచి ప్రాజెక్టులోకి వచ్చే కృష్ణాజలాలు 500 క్యూసెక్కులకు తగ్గడంతో మైలవరానికి నీరు నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.8 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ డీడీగా పెద్దయ్య

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ డీడీగా పెద్దయ్యను ప్రభుత్వం నియమించింది. ఇదే కార్యాలయంలో సహాయ సంచాలకుడు (ఏడీ)గా పనిచేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పించారు. దీంతో కార్యాలయంలో ఆయనకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఏపీఈఎస్ఎస్‌ఏ ప్రెసిడెంట్ రమేశ్‌రాజు, సెక్రటరీ రాంమోహన్‌నాయక్, సంబేపల్లె ఏఎస్‌వో హూస్సేన్‌సాహెబ్, ఆఫీస్ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

నేడు తాత్కాలిక ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, ప్లానింగ్ విభాగాల్లో తాత్కాలిక విజిటింగ్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ నచికేత్

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజలకు పూర్తి అవగా హన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సూపర్‌జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ జీఎస్టీ 2.0 కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చం ద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి అక్టోబరు 19 వరకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 29 నుంచి స్వయం సహాయక సంఘాలు, గ్రామ, వార్డు సచివాలయ సమావేశాలు, వ్యాపార సంస్థలు, ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ పన్నుల తగ్గింపుపై నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే అంశాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవ సాయం, ఇతర వృత్తుల వారికి సంబంధించిన రైతుసేవా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శనల ద్వారా తగ్గింపు ధరలపై అవగాహన కల్పించాలన్నారు, అక్టోబర్ 7 నుంచి 13 వరకు మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాకారంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వ హించాలన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు స్మార్ట్ సాకార ప్రదర్శనలు, 19న నిజమైన దీపావళి కార్యక్రమం నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముందుగా జాయింట్ కమిషనర్ స్టేట్ టాక్సేస్ సుమతి కొత్త జీఎస్టీ ప్రకా రం వివిధ రంగాల వారీగా జీఎస్టీ వర్తింపు ఎలా జరుగుతోందనే విషయాలను వివరించారు. సమా వేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడప విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

కడప విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా నిబం ధనలకు లోబడి ఎయిర్‌పోర్ట్ నూతన భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు అన్ని రకాల భద్ర తా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఎస్పీ షెల్కే నచికే తన్ విశ్వనాథ్‌తో కలిసి కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి చర్చించారు. విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పొద్దర్, కేఎంసీ కమిషనరు మనో జ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంపొందించి, ఔత్సాహిక రైతులకు అవసరమైన వన రులు సమకూర్చాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యవ సాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎన్ఎఫ్) కార్యక్రమం జిల్లాలో అమలు తీరు విస్తరణపై జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్, పర్యావరణ ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నందున ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగులు పండుగలను మరచిపోయారని పేర్కొన్నారు. ఆ ప్రభుత్వం బాధలు భరించలేకే ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా పీఆర్‌సీని ఏర్పాటు చేయడం, కరవు భత్యం కానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రిజ్వాన్‌ఆలీ, పుల్లయ్య, రమణారెడ్డి, నాగచంద్రుడు, మాధవరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధాన నీటిపారుదల, మధ్యస్థ నీటిపారుదల, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన నీటి పారుదలశాఖ ఎస్ఈ, ఈఈలు, డీఈఈ, ఏఈఈ/ఏఈలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జీఎన్ఎస్ఎస్ కాలువ, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లి రిజర్వాయర్ పనులు, అన్నమయ్య ప్రాజెక్టు, వెలిగల్లు ప్రాజెక్టు, మైనర్ ఇరిగేష్ ప్రాజెక్టులు పింఛా, ఝరికోన, బాహుద, పెద్దేరు ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు భూసేకరణకు సంబంధించి గ్రామం, మండలం, విస్తరణ వివరాలను తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లైనింగ్ పనులకు సంబంధించి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులను మొదలు పెట్టాలన్నారు. 178 చిన్న తరహా ట్యాంకుల సంబంధించిన ఎస్టిమేట్లను ఇప్పటికే ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపడం జరిగిందని అధికారులు తెలియజేయగా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ ధీరజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లి సబ్ డివిజన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బి.ఈశ్వర్‌నాయక్ విధులకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో అతడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఆ హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారు. మొత్తం రూ.2 లక్షల 32 వేల 172లు సమకూర్చి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ద్వారా హోంగార్డు భార్య లక్ష్మిబాయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహచరులను కోల్పోవడం పోలీస్ కుటుంబానికి బాధాకరమన్నారు. ఇలాంటి సందర్భాల్లో హోంగార్డులు ఒక్కరోజు అలవెన్స్‌ను విరాళంగా ఇవ్వడం మానవతా విలువలకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, ఏఆర్ ఎస్ఐ బాలాజీ, జూనియర్ అసిస్టెంట్ జయకుమార్, బాధిత కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన ఈర్ల రాజు

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి కొండావాండ్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈర్ల రాజు (28) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం ముద్దినేని వడ్డెపల్లెకు చెందిన ఈర్ల రాజు కొండావాండ్లపల్లె వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో టైరు పంచర్ షాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా కొండావాండ్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డుపై ఎటువంటి సిగ్నల్స్ లేకుండా లారీ ఆగి ఉండడంతో ఢీకొన్నట్లు తెలిపారు. ప్రమాదంలో రాజు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు ఇరువురు చిన్నవయస్సు వారు. కాగా ఇంటి యజమాని మృతి చెందడంతో ముదినేని వడ్డెపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈర్ల రాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించారు. మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రస్తుత దహన సంస్కరణలకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి స్వగ్రామమైన ముదినేనివడ్డెపల్లెకు మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించారు.

రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గల అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. రికార్డులు, కేసు డైరీలు, లాకప్ గది, ఫిర్యాదుల రిజిస్టర్, సిబ్బంది విధి నిర్వహణ అన్నింటినీ పరిశీలించి పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసులకు అత్యంత పెద్ద బలమని ఆయన అన్నారు. అనంతరం ఎస్పీ పాత పోలీసు క్వార్టర్స్‌లోని పోలీసు జాగిలాల కెనాల్స్‌ను సందర్శించారు. అక్కడ డాగ్స్ సంరక్షణ, శిక్షణ, ఆహార సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నేరాల నియంత్రణలో పోలీసు జాగిలాల పాత్ర కీలకం అని, వాటిపై తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ డాగ్స్ ఇన్‌చార్జి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మణిగండన్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జి ఆదేశాలతో రంగస్వామి ఆచూకీ గుర్తింపు



రంగస్వామితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి

కడప రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు ఇంటి నుంచి కనిపించకుండా పోయిన రంగస్వామి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు రంగస్వామిని గురువారం జిల్లా ప్రధాన జడ్జి ఎదుట హాజరుపరిచారు. రంగస్వామితో జడ్జి మాట్లాడి తదుపరి చట్టపరమైన సహాయ చర్యలను తీసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఆదేశించారు. బ్రహ్మంగారిమఠానికి చెందిన గుర్రం లక్ష్మి తన కుమారుడు గుర్రం రంగస్వామి ఇంటి నుంచి కనిపించకుండా పోయాడని, ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని... నా కుమారుని నా దగ్గరకు చేర్చాలని జిల్లా ప్రధాన జడ్జికి బుధవారం విన్నపం ద్వారా అభ్యర్థించారు. ఈమేరకు జడ్జి వెంటనే స్పందించి రంగస్వామి ఆచూకీని తెలుసుకోవడానికి డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబావక్రుద్దీన్‌ను నియమించారు. ఆయన పోలీసుల సహకారంతో రంగస్వామిని కనుగొని ప్రధాన న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

హ్యాకథాన్‌తో ఆలోచన శక్తి బహిర్గతం



ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన బృందాలతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2025 కార్యక్రమం ద్వారా విద్యార్థులోని ఆవిష్కరణాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన శక్తి బహిర్గం అవుతుందని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త అన్నారు. గురువారం ఇడుపులపాయలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2025లో భాగంగా విద్యార్థులు అభివృద్ధి చేసిన వివిధ విభాగాల వారీగా అప్లికేషన్లు ప్రదర్శించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, డీన్ ఆఫ్ అకడమిక్స్ రమేష్‌కైలాష్, ఎస్‌పీఓసీ కోఆర్డినేటర్ ఉదయశ్రీ తదితర కమిటీ/జ్యూరీ మెంబర్స్ సమక్షంలో నిర్వహించగా 106 బృందాలు తమ అప్లికేషన్లను ప్రదర్శించాయి. ఇందులో 50 ఉత్తమ బృందాలను ఎన్నుకొని నేషనల్ ఫైనల్స్‌కి పంపించేలా చేస్తామని అధికారులు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య



మహబూబ్‌జాన్ (ఫైల్)

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోస్‌నగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌జాన్ (46) అనే మహిళ భర్త వేధింపులు తాళలేక గురువారం తెల్లవారుజామున ఒంటిపైన కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల్లోకి వెళితే... రెండు నెలల క్రితం మృతురాలి కుమార్తెలు ఇద్దరు ఇదేవిధంగా కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెళ్లికాలేదన్న బాధతో మనస్థాపానికి గురై అక్కా, చెల్లెళ్లు ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి మహబూబ్‌జాన్‌కు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయాన్ని తెలుసుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళ ఆత్మహత్యపై విచారించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరొకరికి గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కారును ఓవర్‌టేక్ చేయబోయిన పల్సర్ మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడరును ఢీకొంది. ఈప్రమాదంలో చంద్రశేఖరరెడ్డి (25) అనే యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన 24వ తేదీ బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా... ఖాజీపేట మండలానికి చెందిన చెన్నకేశవ రెడ్డి లారీ డ్రైవ రుగా పనిచేస్తూ తన కుటుంబ సభ్యులతో కడప నగరంలోని నబీకోటలో నివాసం ఉంటున్నాడు. ఇతని పెద్దకుమారుడైన చంద్రశేఖర్‌రెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నబీకోటకు చెందిన తన స్నేహితుడు వివేక్ సాయితో కలిసి బుధవారం రాత్రి అలం ఖాన్‌పల్లె వైపు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్రగాయాలై పడిపో వడంతో స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మోటరు సైకిలు నడుపుతున్న వివేక్ సాయికి గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

కొత్త జీఎస్టీతో ప్రజలకు మరింత డబ్బు ఆదా

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీఎస్టీ రేట్లతో ప్రజలకు మరింత డబ్బు ఆదా అవుతున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు వస్తువులపై ధరలు తగ్గాయని ప్రజలు తగిన జీఎస్టీ రేట్లను దృష్టిలో పెట్టుకొని వస్తువుల వినియోగాన్ని పెంచుకోవచ్చునని పేర్కొన్నారు. వ్యక్తిగత సంరక్షణ, ప్యాకేజ్డ్ ఫుడ్స్, డెయిరీ స్నాక్స్, కన్ఫెక్షనరీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ ఫ్రోజెన్, న్యూట్రిషన్ ఉత్పత్తులు, వైద్య, మెడికల్ కిట్స్ స్టేషనరీ ఆటోమోటీవ్స్ వాహనదారులు క్రీడా పరికరాలు బొమ్మలు, ఇండోర్ గేమ్స్‌పై జీఎస్టీ తగ్గినట్లు తెలిపారు.

బాకీదారుల ఆస్తుల రికవరీతోనే ఫైనాన్షియర్ హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి బాకీదారుల ఆస్తుల అటాచ్‌మెంటు చేసుకోవడంతో కక్ష పెంచుకొని హత్యకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. ప్రొద్దుటూరు శివారులోని బొల్లవరం సమీపంలో మున్సిపల్ ప్లాట్ల వద్ద నివాసం ఉంటున్న కొండా వేణుగోపాల్‌రెడ్డి పట్టణంలో చాలా మందికి వడ్డీలకు డబ్బులు ఇస్తుండేవారు. సకాలంలో అప్పులు చెల్లించని వారిపై కోర్టులో సివిల్‌దావా వేసి ఆస్తులను అటాచ్‌మెంట్ కోరేవారు. ఈ క్రమంలో 2016లో వెన్నపూస లక్ష్మిరెడ్డి, ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డిల ఇళ్లను కూడా అటాచ్‌మెంట్ కోర్టు ఆర్డర్ ద్వారా రికవరీ పొందారు. అప్పట్లో వారు వేణుగోపాల్‌రెడ్డిపై కక్షతో హత్యాయత్నానికి పాల్పడగా కేసు నమోదు అయింది. దీంతో వీరి మధ్య వైర్యం పెరిగింది. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వాపారులైన లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు హైదరాబాదులో అపార్టుమెంట్ నిర్మిస్తూ తమ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోయిని నగేష్‌కు తమ వైరాన్ని చెప్పుకుని వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చాలని కోరారు. ఖర్చుల కోసం సుమారు రూ.70వేలు నగదును పలు దఫాలుగా ఇవ్వడంతో పాటు జీవనోపాధికోసం ఏదైనా వ్యాపారం పెట్టిస్తామని ఆశ చూపారు. దీంతో నగేష్ తన స్నేహితులైన అజయ్‌కుమార్, శివప్రసాద్, ప్రణయకుమార్‌ల ద్వారా హత్యకు ప్రణాళిక రూపొందించారు. సుమారు నెల రోజుల కిందట హైదరాబాదు నుంచి ఇక్కడకు వచ్చి వేణుగోపాల్‌రెడ్డిపై కిడ్నాప్‌కు నాలుగుసార్లు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీ రాత్రి ఇంటికి వెళుతున్న వేణుగోపాల్‌రెడ్డిపై కారంపొడి చల్లి కాళ్లు, చేతులతో కొట్టి, గొంతుమీద కాలువేసి తొక్కి అతన్ని చంపారు. శవాన్ని దువ్వూరు మార్గంలోని కామనూరు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహంలో పడవేసి హైదరాబాదుకు పారిపోయారు. 21వ తేదీ పోలీసు ప్రత్యేక బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో చాపాడు సమీపంలో కుందూ నదిలో వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని గుర్తించారు. వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రమీళారెడ్డి ఫిర్యాదు మేరకు బాధితులు అనుమానితులపై దృష్టి పెట్టగా కిడ్నాప్, హత్య వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

ఆరుగురు నిందితులు

ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసులో ప్రొద్దుటూరు పట్టణంలోని సాయికుటీర్ రోడ్డుకు చెందిన బిల్డర్ వెన్నపూస లక్ష్మిరెడ్డి (53), భాకరాపేట వీధికి చెందిన మెకానిక్ ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డి (55), తెలంగాణా రాష్ట్రం మెదక్‌జిల్లా అల్లాదుర్గం గ్రామానికి చెందిన బోయిన నాగేష్ అలియాష్ హర్ష (26), మెదక్‌జిల్లా మర్ది ప్రాంతానికి చె ందిన లైనీ అజయ్‌కుమార్ (18), హైదరాబాదు నగరం బాచుపల్లికి చెందిన చింతలచెరువు ప్రణ య్‌కుమార్ (20), మియాపూర్‌లోని శ్రీవాణీనగర్‌కు చెందిన శ్రీనివాసనగర్ ప్రాంతానికి చెందిన కొత్త శివప్రసాద్ (22)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మారుతీవెగనార్ కారు, హోండా యాక్టివా స్కూటీ, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. హత్య కేసులో నిందితులను అరెస్టు చేయడంలో శ్రమించిన డీఎస్పీ పి.భావన, రూరల్ సీఐ నాగభూషణ్, రూరల్ ఎస్ఐలు డి.అరుణ్‌రెడ్డి, కె.సి.రాజు, రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బలిజవీధిలో వెలసి ఉన్న గంగమ్మతల్లి దేవస్థానం వద్ద గురువారం దేవీ నవరాత్రుల సందర్భంగా కామిశెట్టి గోపి దంపతులు పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.



రాజంపేట: కృష్ణమూర్తి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి, రాయచోటి: పాతరాయచోటి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో ద్రాక్షాయణి అమ్మవారు, తోపు గంగమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలకారంలో విజయచాముండేశ్వరిదేవి అమ్మవారు, లక్కిరెడ్డిపల్లె: కాత్యాయనిదేవి అలంకారం

అన్నపూర్ణాదేవి.. ఆదుకోవమ్మా...

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాయచోటిటౌన్/నేతాజీసర్కిల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు ఆలయాల్లో నాల్గవ రోజు గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో, కొత్తపేట రామాపురంలో వెలిసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో గాయత్రి అలంకరణలో, పట్టణంలోని చెక్‌పోస్టు వద్దనున్న ఉమామహేశ్వర ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం, పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకారం, తోపు గంగమ్మ ఆలయంలోని విజయ చాముండేశ్వరిదేవి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

అలాగే రాజంపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణమూర్తి అలంకారం, రైల్వేకోడూరులో వనవిహారిణిగా, నందలూరు వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో కృష్ణమూర్తి అలంకారం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కాళికాంబ, ఒంటిమిట్ట కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మీదేవిగా, సుండుపల్లెలో కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు.



సుండుపల్లె: కాత్యాయని అమ్మవారిగా కన్యకాపరమేశ్వరిదేవి



రాయచోటి చెక్‌పోస్టు శివాలయంలో అన్నపూర్ణేశ్వరిదేవి అలంకారం



ఒంటిమిట్ట: వాసవీమాత ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు

7న పశువుల సంత



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీ త్యాగరాజు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో అక్టోబరు 7 నుంచి ప్రతి బుధవారం పశువుల సంత, మంగళవారం కూరగాయల సంతను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ యార్డు ఏడీ త్యాగరాజు, చైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు కూరగాయలు, ఇతర వస్తువుల విక్రయానికి ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని, మార్కెట్ యార్డులోనే విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి: లక్ష్మీప్రసాద్‌రెడ్డి



మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 లోక్‌కల్యాణ్ మేళా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి మెప్మా కార్యాలయంలో వీధి విక్రయదారులకు మెప్మా పీడీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లక్ష్మి, ఎల్‌డీయం ఆంజనేయులు, మెప్మా అధికారులు, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులు అందజేస్తున్న దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ నారాయణ రాజంపేట గ్రామ సమీపంలో వెలసిన భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు వెండి వస్తువులు బహూక రించారు. తాళ్లపాక రాజాచారి భార్య దివంగత తాళ్లపాక శాంతమ్మ జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేష్ ఆచారి, లక్ష్మీ తనిష్క దంపతులు గురువారం వీటిని అందజేసినట్లు అర్చకుడు సర్వేశ్వరాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు వెండి నాగపడిగె, తలపై మూడు వెండి విభూతిరేఖలు (త్రిపుండు), వెండి శూలం (త్రిశూలం) ఆలయానికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాత కటుంబ సభ్యులు మోహన్‌ప్రీతి, పృధ్వీరాజ్ ఆచారి, స్వాతి కళ్యాణ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నందలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి కార్తీక్ విశ్వనాధ్ పేర్కొన్నారు. స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంపులో విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమేష్, సురేష్, వసంత పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం



రాఘవరాజపురంలో బోర్డు నాటిన రెవెన్యూ శాఖాధికారులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవ రాజపురం గ్రామ పంచాయతీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వే నెంబరు 36/1(77)లో 191 సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అమ్మేశారన్న ఫిర్యాదులు రావడంతో అడ్డుకున్నట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా నిర్మాణాలు చేసి ఉన్న వాటిని గుర్తించి నోటీసులు జారీ చేస్తామని, ఎంత వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కుక్కలదొడ్డి నుంచి అనంతరాజుపేట, కె.బుడుగుంటపల్లె నుంచి రాఘవరాజపురం, శెట్టిగుంట నుంచి రెడ్డివారిపల్లె వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని రెవెన్యూ బృందం పరిశీలిస్తోందన్నారు. రాఘవరాజపురంలో 191 సెంట్ల ప్రభుత్వ భూమి ప్రధాన రహదారికి పక్కనే ఉందని, దీనిని కొందరు వ్యక్తులు క్రయవిక్రయాలు చేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో దానిని స్వాధీనం చేసుకుని బోర్డు నాటామని తెలిపారు. ఈ స్థలాన్ని ఎవరైనా కొనుగోలు చేసి ఉంటే వెంటనే రద్దు చేసుకోవాలని, లేకుంటే తాము ప్రత్యేక చర్యలు తీసుకుని రద్దు చేయిస్తామని తెలిపారు. ఆ భూమి సుమారు రూ.కోటి విలువ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, వీఆర్‌వో సుజనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

● ఏపీఎం మల్లికార్జునరాజు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎల్లాయపల్లె, రాళ్లచెరువుపల్లె గ్రామ పంచాయతీల్లోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులతో బ్యాంకు పథకాలు, డ్వాక్రా రుణాలు వంటి పథకాలపై ఏపీఎం మల్లికార్జునరాజు, కెనరా బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది శ్రీహరి, ప్రతాప్, వెలుగు సీసీ హరిబాబు, వీవోఏలు, డ్వాక్రా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే ఊబకాయం దూరం

పెనగలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మారుతున్న జీవనశైలి విధానం ద్వారా మంచి ఆహారం అలవాట్లతో ఊబకాయాన్ని దూరం చేసుకోవచ్చని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో ఎస్.నిర్మలజ్యోతి అన్నారు. గురువారం చక్రంపేట అంగన్వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషన్ మహోత్సవాల్లో భాగంగా ఆహారపు అలవాట్లు ఊబకాయంపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనం ఆహారపు అలవాట్లు సమతుల్య భోజనం ప్రతిరోజు వ్యాయామం, సరైన నిద్ర ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, సురేఖరాణి, విజయకుమారిలు పాల్గొన్నారు.

ఏపీవో కుటుంబానికి ఆర్థిక సహాయం

పెనగలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ ఏపీవోగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఉమామహేశ్వర్‌రావు కుటుంబ సభ్యులకు గురువారం జిల్లా ఏపీవోల సంఘం ఏపీడీలు, ఉపాధిహామీ సిబ్బంది కలిసి రూ.2,94,821 ఆర్థిక సహాయాన్ని అందించారు. డ్వామా పీడీ వెంకటరత్నం చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● డాక్టర్ తులసిరెడ్డి



పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

సుండుపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ, కూటమి పార్టీలు రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించాయని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు, అరాచకం, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందని ధ్వజమెత్తారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధికి దూరమైందన్నారు. గతానికంటే అప్పులు ఎక్కువ చేస్తోందని మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్‌షాపులు అనే విధంగా తయారైందన్నారు. యూరియా కొరతతో పాటు రసాయనిక ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అనంతరం పింఛా ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్తాన్, మండల అధ్యక్షుడు సల్మాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకాష్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఆచారి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

బాధితురాలికి బ్యాగ్ అందజేత

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తకోడూరులో ఉండే సయ్యద్ నూర్జహన్ బేగం గురువారం సాయంత్రం తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై ఓబులవారిపల్లె మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్తుండగా దారిలో విలువైన పత్రాలున్నా బ్యాగ్‌ను పోగొట్టుకుంది. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా స్పందించిన ఎస్ఐ తమ సిబ్బందితో గాలించారు. కాగా కానిస్టేబుల్ రాజేంద్ర బ్యాగ్‌ను గుర్తించి ఎస్ఐకు తెలియజేశారు. వెంటనే బాధితురాలిని స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ బ్యాగ్‌ను అందజేశారు. కాగా పోలీసులకు, గ్రామస్థులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

దీన్‌దయాల్ జీవితం యువతకు స్ఫూర్తి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): యువత పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక అర్చన కళాశాలలో ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన వ్యక్తి దీన్‌దయాల్ ఉపాధ్యాయ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్ మాట్లాడుతూ దేశం సాధిస్తున్న విజయాలు నేటి ప్రభుత్వం, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక వసరుల కల్పన దీన్‌దయాల్ ప్రేరణ అన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరాజు, చీర్ల శ్రీనివాసయాదవ్, అర్చన విద్యాసంస్థల చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, పీలేరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేటలో: పట్టణంలోని మన్నూరు బీజేపీ కార్యాలయంలో పండిట్ దీనదయాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో దీనదయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమ్మెట సురేంద్రరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు సునీత నారాయణవర్మ, జిల్లా మహిళా మోర్చ నాయకురాలు వెంకటసుబ్బమ్మ, మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.



పండిట్ దీనదయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాయిలోకేష్ తదితరులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్, కార్మికులు

రాజంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని సాయినగర్ సచివాలయ పరిధిలో ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛతాహీ సేవా - స్వచ్ఛ ఉత్సవ్-2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ శ్రీనివాసులు, ఆర్టీసీ డీపో ఇన్‌చార్జి మేనేజర్ మాధవిలతలు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్ బి.హర్షవర్ధన్, సెక్రటరిలు, సచివాలయ సిబ్బంది, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రాధాకృష్ణ, నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణలు పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సదరు పంచాయతీలోని ప్రధాన రహదారులను అధికారులు, నాయకులు, కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు సురేష్, రమణ, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

కోదండరామున్ని దర్శించుకున్న పోతుగుంట



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న రమేష్‌నాయుడు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని గురువారం ఉదయం శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణ రామవాచార్యులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. చైర్మన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తామన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి, మండల అధ్యక్షుడు భానుప్రకాష్‌రాజు, మాజీ మండలాధ్యక్షుడు శివరాజు, సిగే భాస్కర్ రెడ్డి, కట్టా యానాదయ్య, గురూజి, రామయ్య, నాగరాజు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూపిణీ... కాత్యాయనీ

పీలేరులో అర్ధనారీశ్వర అలంకరణలో కన్యకా పరమేశ్వరి ● పార్వతీదేవిగా రెడ్డెమ్మతల్లి ● అభయం నొసంగిన కాత్యాయనీదేవి


అర్ధనారీశ్వర అలంకరణలో కన్యకా అమ్మవారు (పీలేరు)


కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు (కలకడ)


కాత్యాయనీదేవి అలంకరణలో యల్లమ్మ తల్లి (కలికిరి)

పీలేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలయాల్లో అమ్మవార్లు కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు అభయం ఇచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు కనువిందు కలిగించారు. మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని దిన్నె గంగమ్మ ఆలయం, తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన పూజలు చేయించారు.


కాత్యాయనీగా కన్యకాపరమేశ్వరీ (కురబలకోట)


చింతపర్తిలో కాత్యాయనీదేవిగా వాసవీ అమ్మవారు

పార్వతీదేవిగా రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అమ్మవారిని రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు భక్తులకు పార్వతీదేవిగా దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. గుర్రంకొండ పోలేరమ్మ అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులను కరుణించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాత్యాయనీదేవిగా చౌడేశ్వరిదేవి

కలకడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోన చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా పూజలందుకు న్నారు. వేకువజామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకం విశేష పూజలను చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

కాత్యాయనీదేవిగా యల్లమ్మ

కలికిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి కాత్యాయనీదేవి అలంకరణలో సాక్షాత్కరించారు. ఉదయాన్నే అమ్మవారిని కాత్యానీదేవి అలంకరణలో తీర్చిదిద్ది అర్చనలు, అభిషేకాలు పూర్తి చేశారు. శక్తి స్వరూపిణిగా శౌర్యానికి, రక్షణకు, విజయాలకు ప్రతీకగా ప్రసిద్ధి చెందిన సింహ వాహనాన్ని అధిష్టించిన కాత్యాయనీ అమ్మవారిని దర్శించుకున్నారు. సోమేశ్వరాలయంలో పార్వతీదేవి సాక్షాత్తు మహిషాసురమర్ధినిగా ఉగ్రరూపంతో భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు కుంకుమార్చనలు సమర్పించారు.

ఓం శక్తిదేవిగా నల్లవీరగంగాభవాని అమ్మవారు

వాల్మీకిపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వానరగుట్ట ప్రాంతంలో వెలసిన నల్లవీరగంగాభవాని ఆలయంలో అమ్మవారికి ఓంశక్తిదేవి అలంకరణ చేశారు. కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మహాల క్ష్మీదేవి, వాల్మీకినగర్‌లోని బోయకొండ గంగమ్మ దేవతకు, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి ఆలయంలో, చింతపర్తి వాసవీ అమ్మవారి ఆలయంలో కాత్యాయనీ దేవి అలంకరణ చేశారు. గొల్లపల్లె విరూపాక్షమ్మ ఆలయంలో మీనా క్షిదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తుల సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నవితరణ చేపట్టారు.

అన్నపూర్ణేశ్వరి అలంకరణలో మాతమ్మతల్లి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి కాత్యాయనీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయానికి పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ఆలయం ముందు అమ్మవారి ఉత్సవవిగ్రహం ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యంలో భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు.

కాత్యాయనీ అలంకరణలో...

కురబలకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరాశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు కా త్యాయనీ అలంకరణలో దర్శనమిచ్చారు. కురబలకోట కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం కిటకిటలాడగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నీరుగట్టువారిపల్లెలో...

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో సాయంత్రం కనకదుర్గాదేవి అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనం కల్పించారు. కోర్టు ఆవరణలోని కోర్టులో గంగమ్మకు విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శ నం కల్పించారు. సాయంత్రం గంధంతో అలంకరించారు. వాస వీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో లలిత సహస్రనా మార్చానలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం అన్నపూర్ణే శ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవళం వీధిలోని సోమేశ్వర స్వామి ఆలయం, ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం, దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయం లో గాయిత్రీదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించా రు. బాట గంగమ్మ ఆలయంలో సాయంత్రం శాకాం బరీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు.

తంబళ్లపల్లెలో...


తంబళ్లపల్లె, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో వారాహి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వారాహి అలంకరణ (ములకలచెరువు)


కాత్యాయనీదేవిగా సత్యమ్మతల్లి (వాల్మీకిపురం)



గూడుపల్లె దిగువ చెరువు కాలువకు గండి

- **చెరువులో నుంచి వృథాగా వెలుతున్న నీరు**
- **పరిస్థితి ఇలాగే ఉంటే చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం**

ములకలచెరువు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె ఎగువ చెరువు కాల్వకు గండి పడడంతో నీరు వృథాగా పోతోంది. చెరువులోకి వచ్చే నీటి కాల్వ కావడంతో నీరు రాకపోవడంతో పాటు చెరువులోని నీరు కూడా వృథాగా వెళ్లి పాపాఘ్నిలో కలుస్తున్నాయి. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు సోంపల్లె పెద్ద చెరువు నిండి మొరవపోతుండడంతో నీరు గూడుపల్లె ఎగువ చెరువుకు చేరి నిండింది. ఎగువ చెరువు కూడా మొరవపోతుండడంతో నీరు దిగువన ఉన్న గూడుపల్లె దిగువచెరువుకు చేరుతున్నాయి. దిగువ చెరువు కూడా నిండింది. చెరువు మొరవపోయే సమయంలో చెరువులోకి నీరు వచ్చే కాల్వకు గండిపడింది. దీంతో చెరువులోకి నీరు రావడం లేదు. దీనికి తోడు చెరువులో ఉన్న నీరు కూడా కాల్వ ద్వారా వచ్చి గండి పడ్డ చోట నుంచి పాపాఘ్ని ఏరులో కలిసి పోతున్నాయి. నీటి వృథాను అరికట్టకపోతే చెరువులోని నీరు అన్నీ కాల్వలోకి తిరిగి వచ్చి గండిపడ్డ చోటు నుంచి వెళ్లిపోయి చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి చెరువు కాలువకు పడ్డ గండిని పూడ్చి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గండి పడి వృథాగా పోతున్న నీరు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి


బూర్లపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ గంగాధర్‌తో కలిసి బూర్లపల్లెలో జరుగుతున్న గృహనిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడ చూసినా గృహనిర్మాణ పనులు మందకొడిగా జరుగుతున్నాయని, హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి గృహనిర్మాణ పనులను వేగవంతంగా జరిగేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా నిధులను అందిస్తోందని, హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను పూర్తి చేయించేందుకు వారికి అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ చంద్ర పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారంతో ఆరోగ్యం

పెద్దమండ్యం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నౌజీయాబేగం అన్నారు. సి.గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లీ పిల్లల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు తదతరులు పాల్గొన్నారు.

రోగులు వ్యాధి నిర్ధారణ చేసుకోవాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం స్వస్థ నారీ స శక్తి కుటుంబ అభియాన్ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యం, పోషణ, కుటుంబసంక్షేమంపై అవగాహన కల్పించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, మహిళా రోగులు సహకులతో చర్చించి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, సక్రమైన ఆహారం, సాధారణ వ్యాధుల నివారణపై సూచనలు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోటేశ్వరీ, ఆర్ఎంఓ షకూర్, నర్సింగ్ సూపరింటెండెంట్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళకు పాము కాటు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండంగా ప్రభావతి పాము కాటుకు గురైంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు కురబలకోట మండలం, తెట్టు గ్రామంలో పొలం పను చేస్తున్న గోపాల్ భార్య ప్రభావతిని పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

పుట్టగొడుగులతో అదనపు ఆదాయం


పుట్టగొడుగుల పెంపకం గురించి వివరిస్తున్న మంజుల

కలికిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు గ్రామాల్లో పుట్టగొడుగుల పెంపకం చేపడితే అదనపు రాబడిని సాధించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ కె.మంజుల తెలిపారు. వ్యవసాయానికి అనుబంధంగా పుట్టగొడుల పెంపకాన్ని ఎంచుకోవచ్చన్నారు. స్థానిక కేవీకేలో గురువారం పుట్టగొడుగుల పెంపకంపై జరిగిన శిక్షణలో ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ పుట్టగొడుగుల్లోని పోషక విలువలు, పెంపకానికి వాడే విత్తన రకాల గురించి వివరించారు. సస్య రక్షణ శాస్త్రవేత్త వీరూసాహెబ్ మాట్లాడుతూ పెంపకానికి, మార్కెటింగ్‌కు ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, పాల పుట్టగొడుగులు అనువుగా ఉంటాయన్నారు. సేద్య విభాగం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు పుట్టగొడుగులతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు ఇళ్ల వద్దనే పుట్టగొడుగుల పెంపకానికి ఏర్పాట్లు చేసుకోవచ్చన్నారు. శిక్షణలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి


మార్కెట్‌లో టమోటాలు పరిశీలిస్తున్న దృశ్యం

ములకలచెరువు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో గురువారం టమోటా వేలం పాటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమోటా ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికార్జున, మండల ఇన్‌చార్జి అంజనప్ప, నేతలు చౌడప్పయాదవ్, సుబ్బన్న, మల్లికార్జున, వేణుగోపాల్‌రెడ్డి, సలీంబాషా, నిజాముద్దీన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మార్పు సాధ్యమేనా..?

- **ముఖ్యమైన రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం...**
- **అవస్థలు పడుతున్న ప్రజలు**
- **నేడు మదనపల్లె, తంబళ్లపల్లెపై సమీక్షించనున్న కలెక్టర్**



మదనపల్లె టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద డివిజన్‌గా పేరుప్రఖ్యాతులున్న మదనపల్లె రెవెన్యూ డివిజన్ జిల్లాల పునర్విభజన పుణ్యమా అని 30 మండలాల డివిజన్‌ను 11 మండలాలతోనే సరిపెట్టేశారు. వైసీపీ పాలనలో మదనపల్లె డివిజన్‌లో 14 వేల ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడం, వీటి సాక్ష్యాలు నాశనం చేసేందుకు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనంతో రాష్ట్ర వ్యాప్తంగా మదనపల్లె సబ్‌కలెక్టరేట్ పేరు మార్మోగింది. అటువంటి ఈ డివిజన్‌లో ప్రస్తుతం ప్రజలకు రెవెన్యూ సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. అర్హులైన రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తీసివేయాలన్నా, భూముల మ్యుటేషన్, మార్పులు చేయాలన్నా, చివరికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలన్నా రెవెన్యూ అధికారులు ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ డివిజన్‌లో వేల సంఖ్యలో కుల ధ్రువీకరణ పత్రాలు సుమోటో కేసులుగా ఉన్నాయంటే అతిశ యోక్తి కాదు. ఇలాంటి తరుణంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. నెలన్నర క్రితం సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన యువ ఐఏఎస్ అధికారి చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో కలెక్టర్ నిర్వహించనున్న సమీక్షలో పలు అంశాలను ప్రశ్నించి, సమాధానాలు రాబట్టనున్నారు.

ప్రతి వారం వందకు పైగా పీజీఆర్ఎస్ అర్జీలు

మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని 9 మండలాలు, ఒక మున్సిపాలిటీ, పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, వాల్మీకిపురం మండలాలతో కలిపి మొత్తం 11 మండలాలు ఉన్నాయి. ప్రతి సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు 100కుపైగా ప్రజల నుంచి అర్జీలు వస్తూనే ఉన్నాయి. గత కలెక్టర్ శ్రీధర్ చామకూరి హయాంలో అవినీతి, అక్రమాలపై ఆరోపణలు ఎదుర్కొన్న తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్‌ఓలను పలు సందర్భాల్లో బదిలీలు చేశారు. అయినా ప్రజలకు నిర్దేశిత సమయాల్లో అందాల్సిన రెవెన్యూ సేవలు సక్రమంగా అందడం లేదు. వీటిలో భూసర్వేలు, 22ఏ జాబితా నుంచి తొలగించడం, మ్యుటేషన్లు, పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారమే ముఖ్య అంశాలుగా చెప్పవచ్చు. వీటితో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ సంఖ్య 15 వేలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

9 అంశాలపై నేడు కలెక్టర్ సమీక్ష

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ నేడు సమీక్ష నిర్వహించనున్నారు. ఇదివరకే పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో పర్యటించి సమీక్షలు నిర్వహించిన కలెక్టర్ మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు ఆలస్యమవుతూ వచ్చింది. ఎట్టకేలకు శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల అధికారులతో సమీక్షిస్తారు. ఉదయం 10 గంటలకు మదనపల్లెలో, మధ్యాహ్నం తంబళ్లపల్లె సమీక్షలు ఉన్నట్లు తెలిసింది. కలెక్టర్ సమీక్షతో అయినా రెవెన్యూ అధికారుల్లో మార్పు వస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సి వుంది.

పీటీఎంలో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఏపీఓ అంజనప్ప అన్నారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించిన ఏపీఓ మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులకు ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సాగు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.





చీకటి నుంచి.. వెలుగుల్లోకి...

నాలుగేళ్ల తరువాత వెలిగిన వీధి దీపాలు

కాంతులీనుతున్న ములకలచెరువు

ములకలచెరువు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఎట్టకేలకు వీధి దీపాలు వెలిగాయి. దీంతో నాలుగేళ్లుగా నెలకొన్న గాడాంధకారం తొలగి కటిక చీకటి నుంచి ములకలచెరువు వెలుగులోకి తొంగిచూసింది. శ్రీ సత్యసాయి - అన్నమయ్య జిల్లా సరిహద్దులోని ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కిలో మీటర్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్ - 42) విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం 2021లో రూ.480.10 కోట్లు విడుదల చేయడంలో పనులు ప్రారంభించారు. జిల్లా సరిహద్దు నుంచి పనులు ప్రారంభించారు. అప్పట్లో పనులకు అడ్డుగా ఉన్నాయని రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ముంబై - చెన్నై జాతీయ రహదారిలోని షాదీమహల్ నుంచి బస్టాండు సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పెట్రోల్ బంకు, రైల్వే గేటు వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర ఉన్న పాత స్తంభాలు, వాటికున్న విద్యుత్ దీపాలు తొలగించారు. తరువాత రోడ్డు పనులు ముగిశాక రోడ్డు పొడవునా ఇరువైపులా పెద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అయితే వాటికి కనెక్షన్ ఇవ్వకుండా అలాగే వదిలేశారు. దీంతో ములకలచెరువు ప్రధాన రహదారిలో అంధకారం నెలకొంది. రాత్రి వేళ రోడ్డుపై వెళ్లాలంటే భయమేసేది. పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోడ్డు దాటే సమయంలో తీవ్ర ఇబ్బంది కలిగేది. ద్విచక్రవాహన దారులు కూడా అవస్థలు పడేవారు. అంధకారం కారణంగా అసలు ములకలచెరువు ఊరు ఉందో లేదో కొత్తవారికి అనుమానం కలిగేది. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట వీధి దీపాలకు అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. తరువాత చిన్నచిన్న పనులు ముగించి బుధవారం రాత్రి నుంచి లైట్లను వెలిగించారు. దీంతో ములకలచెరువులో కొత్తగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు అన్నీ వెలుగుతున్నాయి. అంధకారం తొలగి వెలుగులు విరజిమ్మాయి. నాలుగేళ్ల తరువాత వీధి దీపాలు వెలగడంతో సానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాల్సిందే

● రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్



రెవెన్యూ డివిజన్ ప్రతిపాదనకు సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నేతలు

పీలేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అనాదిగా నిర్లక్ష్యానికి గురవుతున్న పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం మూన్‌లైట్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో జరిగిన జిల్లాల విభజన సమయంలో పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తారని ఆశించినా జరగలేదన్నారు. త్వరలో మదనపల్లెను జిల్లాగా ప్రకటించే అవకాశం ఉన్నందున, మదనపల్లె జిల్లాతో పాటు పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని వారు కోరారు. పీలేరు ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, సుభాష్, జనసేన నేతలు కలప రవి, మోహనకృష్ణ, వైసీపీ నేతలు చక్రధర్, జాకీర్, బీజేపీ నేత సుదర్శన్ రెడ్డి, కమ్యూనిస్టు నేత టీఎల్ వెంకటేశ్, కాంగ్రెస్ నేతలు శ్రీకాంత్, అమృతతేజ, సాయి సంపత్, దళిత సంఘాల నేతలు నడిమికండ్రి సుధాకర్, తుమ్మల ధరణీ కుమార్, చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం : సీడీపీఓ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. బూర్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపించాలన్నారు. హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పీలేరు ఏపీపీగా శివప్రసాద్ రెడ్డి



పీలేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా న్యాయవాది టి.శివప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీపీగా నియమితులైన శివప్రసాద్ రెడ్డి రానున్న మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీపీగా నియమితులైన శివప్రసాద్ రెడ్డిని పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, ఇతర న్యాయవాదులు అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రామసముద్రం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌లలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ మస్తాన్ తెలిపారు. రామసముద్రం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కలికిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. రాహుల్ గాంధీ ఉద్యమానికి మద్దతుగా అసంఖ్యాకంగా సంతకాల సేకరణను చేపట్టినట్లు పీలేరు కాంగ్రెస్ నేత సోమశేఖర్ రెడ్డి చెప్పారు. పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సౌకర్యంగా సొసైటీ సేవలు

పీలేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు, ఖాతాదారుల సౌకర్యమే లక్ష్యంగా తమ బ్యాంకులో సేవలు అందిస్తున్నట్లు పీలేరు సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి పేర్కొన్నారు. పీలేరు సింగిల్ విండో, డీసీసీబీ బ్యాంకు సేవలపై సింగిల్ విండో కార్యాలయంలో ఖాతాదారుల అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకులకు తీసిపోని విధంగా డీసీసీబీ, సింగిల్ విండో ద్వారా రైతులు, సామాన్య ప్రజలకు వివిధ రుణాలు, బంగారు ఆభరణాలపై అప్పు ఇస్తున్నట్లు తెలిపారు. కేవలం 15 నిమిషాల్లో ఏ సేవలైనా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

కనువిందు చేసిన ఇంద్రధనుస్సులు



రామసముద్రం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యవేళ గురువారం నీలాకాశంలో రెండు సప్తవర్ణాల ఇంద్రధనుస్సులు చూపరులకు కనువిందు చేశాయి. చిరుజల్లులు పడుతున్న సమయంలో మండల కేంద్రానికి తూర్పున ఉన్న అడ్డకొండ నుంచి పచ్చని పొలాలను కలుపుతూ గురువారం ఏకకాలంలో రెండు ఇంద్రధనుస్సులు ఏర్పడ్డాయి. మొదటి ఇంద్రధనుస్సు చూస్తుండగానే మరొక ఇంద్రధనుస్సు ఏర్పడింది. సాధారణంగా ఒక ఇంద్రధనుస్సు ఏర్పడం చూస్తుంటాం, కానీ ఏకకాలంలో రెండు ఇంద్రధనుస్సులు ఏర్పడడం అరుదు అని చూపరులు చర్చించుకున్నారు.

మునుపటి జాబితాకు వ్యత్యాసం తేల్చండి



సబ్‌కలెక్టరేట్‌లో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఎపిక్ డీటీ రాఘవేంద్ర

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): 2002లో రూపొందించిన ఓటరు జాబితాకు, 2025లో రూపొందించిన ఓటరు జాబితా ఓటర్ల వివరాలు, వ్యత్యాసాలను గుర్తించాలని ఎపిక్ డీటీ రాఘవేంద్ర సూచించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో మదనపల్లె పట్టణంలోని బీఎల్‌ఓలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట రూపొందించిన ఓటరు జాబితాలో వున్న సీనియర్ ఓటర్లలో మృతి చెందిన వారు, మరో ప్రాంతాలకు వెళ్లిన వారిని గుర్తించి తొలగించాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ తిరగాల్సిన అవసరం లేదని, పాతది, కొత్తది ఓటర్ల జాబితా ముందు వుంచుకుని యాప్‌లో పరిశీలించాలన్నారు. వ్యత్యాసాలను గుర్తించి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

డ్రగ్స్ జోలికి వెళితే జీవితాలు నాశనమైనట్లే



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ విజయకుమార్

కలికిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అసాంఘిక వ్యవహారాలపట్ల అప్రమత్తంగా వుండాలని సీఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులైతే తలెత్తే దుష్పరిణామాల కారణంగా భవిష్యత్తు గురించి ఆశలు వదిలేసుకోవలసిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ విజయకుమార్, వైద్యులు కావ్యగంధ, క్షయ చికిత్స అధికారి నాగిరెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, కళా శాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఇస్మాయిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి



పీలేరులో చెత్తను శుభ్రం చేస్తున్న డీపీఓ రాధమ్మ, పీలేరు ఎంపీడీఓ రాజేశ్వరి

పీలేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) రాధమ్మ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా అమలు చేస్తున్న ఏక్ దిన్-ఏక ఘంటా-ఏక్ సాథ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పీలేరు పంచాయతీలో రోజూ తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, సేకరించిన చెత్తను బృందావనానికి తరలించి ఎరువుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వరి, డిప్యూటీ ఎంపీడీఓ సగ్బతుల్లా, కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, సిబ్బంది ప్రసాద్ రెడ్డి, మున్నా, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సివిల్ రైట్స్ డే

పీలేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దళితవా డల్లో సమస్యల పరి ష్కారం కోసమే సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్న ట్లు పీలేరు తహసీల్దా రు శివకుమార్ పేర్కొ న్నారు. బండమీద హరి జనవాడలో గురువారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. తమ గ్రామ సమీపంలో ప్రవహించే బడబళ్లవంక కారణంగా వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నామని, దానిపై వంతెన నిర్మించాలని కోరారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఉంటోందన్నారు. వాటిని పరిష్కరించాలని కోరారు. తహసీల్దారు మాట్లాడుతూ వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ రాజేశ్వరి, ఏఓ రమాదేవి, ఎస్ఐ రహీమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి వృద్ధురాలు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మిద్దెపై నుంచి జారి పడి వృద్ధురాలు వెంకటమ్మ (65) మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు స్థానిక టిప్పు సుల్తాన్ మైదానం సమీపంలో ఇంటిపై నుంచి నాగిరెడ్డి భార్య వెంకటమ్మ జారి పడింది. తలకు గాయమవడంతో కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ఇరువర్గాల ఘర్షణ - ఐదుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలంలోని మాలేపాడు దొనబైలుకు చెందిన పెద్దన్న కుమారులు వెంకటరమణ, శంకర, మల్లేశ్వరమ్మ, మరో వర్గం రామకృష్ణ, జి. వెంకటరమణ, రామలక్ష్మమ్మ గొడవ పడ్డారు. ఇందులో డి. వెంకటరమణను కర్రతో దాడి చేసి గాయపర్చారు. ఆయన కుటుంబ సభ్యులు వెంకటరమణ, శంకర, మల్లేశ్వరమ్మపై దాడి చేయడంతో అందురూ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.